కేయూ పోలీస్ స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైలు

'నమస్తే' కథనానికి స్పందన

నయీంనగర్, డిసెంబర్ 26 : కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు ఇద్దరు ఎస్సైలను కేటాయిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24న ఫిర్యాదుదారులకు స్టేషన్‌లో ఎస్సైలు లేక ఇబ్బంది కలుగుతున్నదని, కేయూ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైల కొరత అనే వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. స్పందించిన సీపీ స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్సైగా పని చేస్తున్న బీ మాధవ్, ఎనుమాముల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న పీ శ్రీకాంత్‌ను కేయూ పోలీస్ స్టేషన్‌కు కేటాయించారు.

1.9 కిలోల గంజాయి పట్టివేత

కాజీపేట, డిసెంబర్ 26 : పట్టణంలో పోలీసులు గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటాద్రినగర్, బ్రిడ్జి సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయడంతో కిలో 900 గ్రాముల ఎండు గంజాయి లభించింది. వారిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించారు. భూపాలపల్లికి చెందిన వేముల నిఖిల్, కమలాపురం మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన వట్టెముల నాగరాజు గంజాయి అమ్మేందుకు కాజీపేటకు వచ్చినట్లు చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

నేడు పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు

హసన్‌పర్తి, డిసెంబర్ 26 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు భీమారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కార్పొరేటర్ జక్కుల రజితావెంకటేశ్వర్లు, పందిళ్ల రమేశ్‌బాబు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సారంగపాణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల సారంగపాణి, గడ్డం శివరాం ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే నాగరాజు

నయీంనగర్, డిసెంబర్ 26 : నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. 56వ డివిజన్‌లోని జవహర్‌కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద స్మార్ట్‌సిటీ నిధులు రూ. 3.20 కోట్లతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు రూ. 2.20 కోట్లతో జవహర్ కాలనీలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ కాలనీల నుంచి అనేక వినతులు వచ్చాయని, వాటిని పరిశీలించి సమస్యలను త్వరతగతిన పరిష్కరించేలా అధికారులతో మాట్లాడుతానన్నారు. కాలనీలలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు చెప్పగా, త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు గ్రామ సభలో పాల్గొన్న అధికారులు

ఆత్మకూరులో సామాజిక తనిఖీ గ్రామ సభ

ఆత్మకూరు, డిసెంబర్ 26 : ఆత్మకూరు పరిధిలో చేపట్టబడిన ఎంజీఎన్ఆర్ఈఎస్ ఉపాధి హామీ పథకంలో భాగంగా గురువారం పంచాయతీ కార్యాలయంలో సోషల్ ఆడిట్ టీం క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించింది. నూతనంగా 20 మంది కుటుంబాలు కొత్త జాబ్ కార్డుల కోసం గ్రామ సభలో దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఎస్ఆర్పీ రమేశ్, డీఆర్పీ రాజ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ శ్వేత పాల్గొన్నారు.

చెరువులో అర్ధరాత్రి మొరం తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి

మొరం దందాకు అడ్డుకట్ట ఏది?

- అర్ధరాత్రి యథేచ్ఛగా చెరువుల్లో తవ్వకాలు
- అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

శాయంపేట, డిసెంబర్ 26 : చెరువుల్లో అక్రమంగా మొరం తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దొరికితే దొంగలు అన్నచందంగా పరిస్థితి మారిపోయింది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తీస్తూ అమ్ముకుంటున్నారు. మండల పరిధిలోని జోగంపల్లి, సూరంపేట, పత్తిపాక, శాయంపేట తదితర గ్రామాల్లో మొరం తవ్వకాలు జరుగుతున్నట్లు తెలుస్తున్నది. మూడు రోజుల క్రితం శాయంపేట పరిధిలోని నల్లకుంట చెరువులో అర్ధరాత్రి మొరం తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తుండగా పోలీసులు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కొంతకాలంగా నల్లకుంట కేంద్రంగా మొరం దందాకు పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనుమతులు లేకుండా మట్టిని తవ్వి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తుండటంతో రాత్రి వేళల్లో శబ్దాలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అలాగే జోగంపల్లి పరిధిలోని ఓ చెరువులో మొరం తవ్వకాల వల్ల కొంతకాలం క్రితం గొడవలు జరిగినట్లు తెలిసింది. పత్తిపాక శివారులోనూ మొరం దందా వెలుగులోకి వచ్చింది. అయితే గుట్టుగా చెరువుల మట్టి తరలింపు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా అక్రమ దందాకు అడ్డుకట్ట చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల రెఫరీగా కృష్ణమూర్తి

కాజీపేట, డిసెంబర్ 26 : హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో త్వరలో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కాజీపేటకు చెందిన రైల్వే రిటైర్డ్ కార్మికుడు, జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్ మండలోజు కృష్ణమూర్తి రెఫరీగా ఎంపికయ్యారు. కృష్ణమూర్తి గతంలో జాతీయ స్థాయి లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు. పలు వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు రెఫరీగా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, కృష్ణమూర్తిని తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సీఎం కప్ పోటీల్లో రెఫరీగా ఎంపిక చేయడంతో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, స్థానిక క్లబ్‌ల నిర్వాహకులు, సీనియర్, జూనియర్ క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

భీమదేవరపల్లి, డిసెంబర్ 26 : మిషన్ భగీరథ నీటి సరఫరాలో శుక్రవారం అంతరాయం కలుగుతుందని హుజూరాబాద్ మిషన్ భగీరథ ఈఈ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్‌లో 132/33కేవీ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంచి మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో మండలంలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

కమలాపూర్, డిసెంబర్ 26 : మండలంలోని అంబాల గ్రామంలో ఇసుక ట్రాక్టర్ బోల్తా పడింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కల్లుపల్లికి చెందిన ఇసుక ట్రాక్టర్ హనుమకొండకు వెళ్తున్నది. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను ఆపుతున్నారనే భయంతో డ్రైవర్ అతివేగంగా నడపడంతో అంబాల చౌరస్తాలో బోల్తాపడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

నయీంనగర్ : జెండాను ఎగురవేస్తున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

సీపీఐ శత వార్షికోత్సవం

నయీంనగర్/భీమదేవరపల్లి, డిసెంబర్ 26 : బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ శత వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జెండా ఎగురవేసి మాట్లాడారు. మహోజ్వల పోరాట చరిత్ర సీపీఐ సొంతమని, పేదవాడి రాజ్యం వచ్చినప్పుడే సీపీఐకి అసలైన ఆనందం అని అన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, ఎల్లేశ్, సంతోష్, శ్రీనివాస్, సదానందం, శంకర్‌నాయక్, రవి, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సీపీఐ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆదరి శ్రీనివాస్, నాయకులు కర్రె భిక్షపతి, జుర్రు సంపత్, ఆదరి రమేశ్, కొంగల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అక్షయ

దామెర, డిసెంబర్ 26 : ఊరుగొండ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్ అక్షయ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సత్యనారాయణ గురువారం తెలిపారు. కాగా, అక్షయను ఉపాధ్యాయులు గణపతి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సునీత, అనిత అభినందించారు.

ఓపీ నమోదు చేస్తున్న సిబ్బంది

ప్రతిమ వైద్య శిబిరానికి విశేష స్పందన

కమలాపూర్, డిసెంబర్ 26 : మండలంలోని ఉప్పల్ గ్రామంలో కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. బాలికల ఉన్నత పాఠశాలలో ఆస్పత్రి వైద్య సిబ్బంది ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభించగా, రోగులు వైద్య పరీక్షల కోసం క్యూ కట్టారు. ఎక్స్‌రే, 2డీ, స్కానింగ్, ఈసీజీ తీయడంతో పాటు గుండె జబ్బులు, బీపీ, షుగర్, ఊపిరితిత్తుల వ్యాధులు, మలేరియా, డెంగీ జ్వరం పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భీంపల్లి, కన్నూరు, దేశరాజ్‌పల్లి గ్రామాల నుంచి రోగులు వైద్య పరీక్షల కోసం వచ్చారు. శిబిరంలో సుమారు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తోట సురేశ్, సుందరయ్య పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్ల తొలగింపు

గోవిందాపూర్‌లో అక్రమ కనెక్షన్‌ను తొలగిస్తున్న ఏఈ చందులాల్

శాయంపేట, డిసెంబర్ 26 : పంటల రక్షణకు కంచెలకు విద్యుత్ అక్రమ కనెక్షన్లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఏఈ చందులాల్ అన్నారు. గురువారం మండలంలోని గోవిందాపూర్ పరిధిలో పర్యటించి 11 కేవీ విద్యుత్ తీగలకు వేసిన అక్రమ కనెక్షన్లను తొలగించారు. మక్కజొన్న పంటలను అడవి పందుల నుంచి కాపాడుకోవడానికి పంట చుట్టూ ఇనుప తీగలతో కంచె ఏర్పాటు చేసి 11 కేవీ విద్యుత్ తీగల నుంచి కనెక్షన్ ఇస్తున్నారన్నారు. కంచెను అడవి పందులు తాకగానే మరణిస్తున్నాయని, వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రాత్రి వేళల్లో విద్యుత్ క్రమబద్ధీకరణకు వచ్చే సిబ్బంది కూడా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులందరూ సహకరించాలని, అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని కోరారు.

యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : హనుమకొండ డబ్బాల ప్రాంతంలో ఉన్న ఏకశిల జూనియర్ కాలేజీ ఫస్టియర్ విద్యార్థిని శ్రీదేవి మృతికి కారణమైన ఆ విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డిపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. శ్రీదేవి యాజమాన్యం ఒత్తిడి వల్లే ఆత్మహత్య చేసుకొన్నదని, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారని మండిపడ్డారు. ఇంటర్ బోర్డు పర్మిషన్ లేని గర్ల్స్ క్యాంపస్‌ను సీజ్ చేయాలని, డీఐఈవో గోపాల్, కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

రేపు 'నేరెళ్ల' స్మారక పురస్కారం ప్రదానం

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మిమిక్రీ ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ 93వ జయంతి సందర్భంగా స్వరార్చన, నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారం ఈ నెల 28న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించనున్నట్లు నేరెళ్ల వేణుమాధవ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ల శోభావేణుమాధవ్, డాక్టర్ అంపశయ్య నవీన్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఆత్మీయ అతిథులుగా 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ పాల్గొని నేరెళ్ల వేణుమాధవ్ స్మారక ప్రతిభా పురస్కారం మిమిక్రీ శ్రీనివాస్‌కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, డిసెంబర్ 26 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్, అల్లూరి కళాశాల ఏరియాలో ఉదయం 9 నుంచి 12గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ వైద్యం వినియోగించుకోవాలి

డీఎంహెచ్‌వో అప్పయ్య

వృద్ధుడికి వైద్య పరీక్షలు చేస్తున్న డీఎంహెచ్‌వో

ఆత్మకూరు, డిసెంబర్ 26 : రోగులు ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను వినియోగించుకోవాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. గురువారం ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వయోవృద్ధుల కోసం నిర్వహిస్తున్న సేవలను పరిశీలించి పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం ల్యాబ్, ఫార్మసీని పరిశీలించారు. అక్కడికి వచ్చిన పేషెంట్స్‌తో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

కేయూలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి నాయకులు

సమర శంఖారావం పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : రవీంద్రభారతిలో జనవరి 8న నిర్వహించే బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభ పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి అరగంటి నాగరాజు మాట్లాడుతూ.. బీసీ విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల త్యాగాలు, బలిదానాలు లేనిదే తెలంగాణ లేదని, కానీ వచ్చిన రాష్ట్రంలో ఏ వర్గానికి జరగని అన్యాయం విద్యార్థులకే జరుగుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యార్థులకు అండగా నిలబడతామని, బీసీ విద్యార్థులకు పది వేల ర్యాంకు నిబంధనలు ఎత్తివేస్తావన్న మాట ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లిస్తామని చెప్పి సంవత్సరమైనా ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో కేయూ బీసీ విద్యార్థులు రాములు, అశోక్, భద్రయ్య, నాగరాజు, బండి నాగరాజు, సతీశ్, కర్రు, రాజశేఖర్, మధు, ప్రతాప్, అనిల్, మహేందర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 28 మందికి జరిమానా

సుబేదారి, డిసెంబర్ 26 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 28 మందికి జడ్జి జరిమానా విధించారు. ఈ మేరకు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : ఈ నెల 27, 28, 29వ తేదీ వరకు ఖమ్మంలో జరిగే సీఎం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేసినట్లు టీబీఏ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు మార్కాల యాదిరెడ్డి, గడ్డం కేశవమూర్తి, విజయకుమార్, కొత్తగట్టు సుధాకర్, పీసు రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా వాలీబాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. అంతర్జాతీయ క్రీడాకారుడు మార్కాల యాదిరెడ్డి పర్యవేక్షణలో వీరు తర్ఫీదు పొందారు.

బైకును ఢీకొన్న టిప్పర్

మడికొండ, డిసెంబర్ 26 : మడికొండ చౌరస్తాలో గురువారం బైకును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారం గ్రామానికి చెందిన రాజేశ్ రాంపూర్ నుంచి కాజీపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంపూర్ నుంచి మడికొండ మీదుగా ధర్మసాగర్ వెళ్లే టిప్పర్ రాజేశ్ బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేశ్ కుడికాలు నుజ్జునుజ్జయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రాజేశ్‌ను 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా..

- కాంపౌండ్‌వాల్ పనులకు శంకుస్థాపన
- స్పోర్ట్స్ మీట్ బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 26 : గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రెస్ క్లబ్‌లో స్పోర్ట్స్ మీట్-24 ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు నాయిని, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కార్పొరేటర్ రావుల కోమల హాజరై క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ప్రెస్‌క్లబ్ ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని, నిరంతరం అందరికీ అందుబాటులో ఉండి పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్క్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

న్యూశాయంపేట సబ్ స్టేషన్ వద్ద విద్యుత్తు శాఖ అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

హనుమకొండ, డిసెంబర్ 26 : రాబోవు వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకట రమణ తెలిపారు. గురువారం న్యూ శాయంపేట సబ్ స్టేషన్‌లో 5 ఎంవీఎం పవర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 8 ఎంవీఎం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సామర్థ్యం పెంచామన్నారు. ఇప్పటి వరకు ఉన్న 8 ఎంవీఎం పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఇది అదనంగా ఏర్పాటు చేశామని చెప్పారు. దీంతో వేసవిలో లోడ్ ఎంత పెరిగినా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ టౌన్ డీఈ సాంబారెడ్డి, ఏడీఈ మల్లికార్జున్, జానకీ రాంరెడ్డి, దర్శన్‌కుమార్, ఏఈ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అమెరికాలో ఐనవోలు మండల వాసి మృతి

స్నేహితుల సహకారంతో స్వగ్రామానికి మృతదేహం

క్రాంతికుమార్‌రెడ్డి(ఫైల్)

ఐనవోలు, డిసెంబర్ 26 : అమెరికాలోని డల్లాస్ నగరంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతదేహం గురువారం మండలంలోని స్వగ్రామానికి చేరింది. కాగా, సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగ్గయ్యగూడేనికి చెందిన గొలమారి జోజిరెడ్డి-లూత్‌మేరీ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు క్రాంతికుమార్ రెడ్డి(35) అమెరికాలోని డల్లాస్ నగరంలో చదువుకొని కొన్ని సంవత్సరాల నుంచి అక్కడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. తన సహోద్యోగి ప్రియాంకను మూడేళ్ల క్రితం వివాహం చేసుకొన్నాడు. వీరికి ఒక ఆరు నెలల బాబు ఉన్నాడు. కాగా, క్రాంతికుమార్‌రెడ్డి తీవ్రమైన జ్వరంతో హాస్పిటల్‌లో చేరగా, ఫిట్స్ రావడంతో డిసెంబర్ 17వ తేదీన మృతి చెందాడు. క్రాంతికుమార్‌రెడ్డి మెదక్ జిల్లాలోని వర్గల్ నవోదయలో చదువుకున్నాడు. అదే స్కూల్‌లో చదువుకున్న కొంత మంది స్నేహితులు అమెరికాలో స్థిరపడ్డారు. కాగా, స్నేహితుడి మృతదేహాన్ని స్వదేశానికి పంపించడానికి స్నేహితులందరు కలిసి ఆర్థిక చేయూతనందించారు. క్రాంతికుమార్‌రెడ్డి మృతదేహాన్ని స్వదేశానికి పంపించారు. మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకోగా, కుటుంబ సభ్యులు, స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రులు కొడుకు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే సమర్థవంతంగా చేయాలి

- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, డిసెంబర్ 26 :